




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 331

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 23 మే 2026


## హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

● ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన ● రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచి నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించు కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పచ్చదనం పెంపుపై దృష్టి..** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని... తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

- 2లో

## పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర: హోం మంత్రి అనిత

● కడప జిల్లాకు చెందిన అభినయ్ కు అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందన్న అనిత ● గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారమెత్తారని వ్యాఖ్య ● తనపై దాడి జరిగినట్టుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారన్న అనిత



**అమరావతి,కలంకౌంటర్ :** క్రైస్తవ మత ప్రచారకుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారం వెనుక పెద్ద రాజకీయ కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ, దీనిపై పోలీసులు ఇప్పటికే లోతైన విచారణ జరుపుతున్నారని ఆమె వెల్లడించారు. రాజకీయ కుట్ర కోణం లేకపోతే కడప జిల్లాకు చెందిన అభినయ్ దర్శన్... అంతదూరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని హోం మంత్రి అనిత ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను నమ్మించి ఆయన పాస్టర్ అవతారం ఎత్తారని ఆమె ఆరోపించారు. అక్కడ ఆయనపై ఎలాంటి దాడి జరగకపోయినా, జరిగినట్లుగా చిత్రీకరించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఈ డ్రామా వెనుక ఎవరెవరు ఉన్నారనేది పోలీసుల దర్యాప్తులో త్వరలోనే పూర్తిగా బయటపడుతుందని ఆమె స్పష్టం చేశారు. అభినయ్ దర్శన్‌పై గతంలోనే పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని, సమాజంలో వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆయన నిరంతరం ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వాన్ని ఎలాగైనా అప్రదిష్ఠ పాలుచేయాలనే దురుద్దేశంతోనే ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నారా అనే యాంగిల్‌లో కూడా విచారణ సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు, కుట్రలు అస్సలు చెల్లవని, ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే తక్షణమే మానుకోవాలని ఆమె హితవు పలికారు. చట్టాన్ని అతిక్రమించి సమాజంలో అలజడులు సృష్టించాలని చూస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు అభినయ్ దర్శన్‌ను త్వరలోనే పోలీస్ కస్టడీలోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారిస్తామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

## గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం

● జగన్ రాజకీయ ముసుగులో ఫ్యాక్షనిస్టు: మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్ ● అపరిచితుడు క్యారెక్టర్‌లా జగన్ వ్యవహారం ● హత్యా రాజకీయాల అసలు వారసుడు జగన్ ● చంద్రబాబు అభివృద్ధి చూసి జగన్ ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు ● వ్యక్తిగత దూషణలే జగన్ రాజకీయ ఆయుధం ● తెలుగుజాతికి పట్టిన రాజకీయ అరిష్టం జగన్ : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** హత్యా రాజకీయాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ముసుగులో ఉన్న ఫ్యాక్షనిస్టు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. సమాజంలో విద్వేషాలు, హింస, కక్ష రాజకీయాలను పెంచే గొడ్డలి పార్టీ రాష్ట్రానికి హానికరమని మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రెస్‌మీట్‌లో ఫ్రస్ట్రేషన్ స్పష్టంగా కనిపించిందన్నారు. రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే తట్టుకోలేక వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో విమర్శించడానికి ఒక్క అంశం కూడా దొరక్క చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి స్వభావం ఉన్న వ్యక్తులు వస్తారని ముందే గుర్తించి దర్శకుడు శంకర్ అపరిచితుడు సినిమా తీశారేమో అనిపిస్తోంది అంటూ ఎద్దేవా చేశారు. జగన్ చేసిన వ్యాఖ్యలతో రాజారెడ్డి దమనకాండ, నాటి చరిత్ర, వైఎస్ కుటుంబ రాజకీయ నేపథ్యం మొత్తం మళ్లీ చర్చకు వచ్చాయని అన్నారు. నేటి తరానికి వైఎస్ కుటుంబ చరిత్ర తెలిసేలా జగన్ స్వయంగా చేసుకున్నారని వ్యాఖ్యానించారు. రాజారెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులందరినీ చంపేశారని, ఒక్క పార్థసారధి రెడ్డి మాత్రమే మిగిలారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి ఈరోజు వైసీపీలో ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నాడని పరోక్షంగా ప్రస్తావించారు. అలాగే వంగవీటి రంగ హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు కూడా జగన్ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కొడుకు నీకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతాడు... సెండాఫ్ ఇస్తాడు అంటూ జగన్‌ను ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డికి హిందూ దేవుళ్లపై ఎందుకు కక్షో అర్థం కావడం లేదన్నారు. తిరుమల ఏడుకొండల అంశాన్ని ప్రస్తావిస్తూ, నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఆ వ్యాఖ్యలను తప్పుపట్టిన చంద్రబాబు వ్యాఖ్యలను ఇప్పుడు జగన్ వక్రీకరించి ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చంపింది జగన్ అని బొత్సనే చెప్పారని నేను చెబితే ఆయన ఎందుకు ఏడ్చారో ఇప్పటికీ అర్థం కాలేదు అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. రిలయన్స్ సంస్థలపై దాడులు చేయించి, మళ్లీ వాళ్లకు రాజ్యసభ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎవరి ప్రమేయం ఉందో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. నీ సొంత చెల్లెలు వైఎస్ సునీత జగన్ ప్రమేయం ఉందని చెబుతోంది... దానికి సమాధానం చెప్పగలవా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవి కోసం బాబాయినే కాదు, సొంత పార్టీ కార్యకర్తలను కూడా వదల్లేదని తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తండ్రి మరణం, బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామా గురించి మాట్లాడిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా వాటిపై మాట్లాడలేదని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. చంద్రబాబుకు నోటీసు కూడా ఇవ్వకుండా 53 రోజులు జైలులో పెట్టారని, తాను తప్పు చేయకపోయినా వేధింపులకు గురిచేశారని అన్నారు. అప్పటి ఎంపీ రఘురామ కృష్ణం రాజును చిత్రహింసలకు గురిచేశారని, కోర్టుల వల్లే ఆయన ప్రాణాలు దక్కాయని చెప్పారు. సోషల్ మీడియాలో తల్లి, చెల్లిని కూడా వదలకుండా అసభ్య పోస్టులు పెట్టించారని ఆరోపించారు. డాక్టర్ సుధాకర్ ఘటన, రేపల్లె నియోజకవర్గంలో అమర్‌నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన, నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబ ఆత్మహత్య వంటి ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో జరిగిన దమనకాండకు ఇవే

- 2లో

## మండే ఎండల్లో పెరుగుతున్న బీర్ అమ్మకాలు



**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బీర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు చల్లని పానీయాలతో పాటు బీర్ వైపు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 2025తో పోలిస్తే ఏప్రిల్ 2026లో బీర్ అమ్మకాలు 31.44 శాతం పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 22.73 లక్షల కేసులు అమ్ముడవగా, ఈ ఏడాది అదే నెలలో 29.88 లక్షల కేసులు విక్రయమయ్యాయి. అలాగే మే నెలలో కూడా అమ్మకాలు భారీగా పెరిగాయి. మే 2025లో తొలి 22 రోజుల్లో 16.42 లక్షల కేసులు అమ్ముడవగా, మే 2026లో అదే కాలానికి 22.21 లక్షల కేసుల అమ్మకాలు నమోదయ్యాయి. ఇది 35.27 శాతం వృద్ధిని సూచిస్తోంది. తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు, వేసవి సీజన్ ప్రభావంతో బీర్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సాయంత్రం వేళల్లో వైన్ షాపులు, బార్ల వద్ద వినియోగదారుల రద్దీ కూడా పెరిగినట్లు సమాచారం.




# బాలికల అభివృద్ధే లక్ష్యంగా కిశోరి వికాసం కార్యక్రమం..



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, కిశోర బాలికలకు ఆర్థిక భద్రత, ఆరోగ్యం, స్వయం ఉపాధి అవకాశాలు మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పెదప్రోలు పోస్ట్ మాస్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పొదుపు పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా సుకన్య సమృద్ధి యోజన ద్వారా బాలికల భవిష్యత్తు కోసం చిన్న మొత్తాల్లోనే పొదుపు చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా పోస్టాఫీస్ సేవింగ్స్ పథకాలు, డిపాజిట్ పథకాలు మరియు మహిళల ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడే పథకాలపై కూడా వివరించారు. బాలికలు విద్యతో పాటు ఆర్థికంగా కూడా బలపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిడిపిఓ ఎండి షహనాజ్ బేగం, సిహెచ్ఓ శిరీష, ఐ సి పి ఎస్ భవాని, వాసవి మహిళా మండలి సభ్యురాలు శాంతి, అంగన్వాడి కార్యకర్తలు నాగమల్లేశ్వరి, శ్రీలక్ష్మి మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం బాలికలు, మహిళల సందేహాలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు.

# అలిపిరి పరిసరాల్లో పుట్ పాత్ లపై దుకాణాలు తొలగించండి - డిప్యూటీ కమిషనర్ అమరయ్య




**తిరుపతి,కలంకౌంటర్ :** అలిపిరి పరిసరాల్లో భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా పుట్ పాత్ లపై ఉన్న దుకాణాలను తొలగించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య అధికారులు, వ్యాపారస్థులకు సూచించారు. భక్తులు, వాహన చోదకుల పిర్యాదు మేరకు ఏ ఎస్పీ రవి మనోహరాచారి, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి అలిపిరి పరిసర ప్రాంతాల్లో పుట్ పాత్ పై ఉన్న వ్యాపారస్థులతో మాట్లాడారు. పుట్ పాత్ పై వ్యాపారాలు చేయడం వలన ప్రజలతో పాటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. అలాగే టిఫిన్ షాప్, దుకాణాల వ్యర్థాలు జూ పార్కు రోడ్డు పక్కనే వేయడంతో వన్యమృగాలు వస్తున్నాయని తెలిపారు. కావున ఇక్కడ ఇబ్బందికరంగా ఉన్న దుకాణాలను ఇక్కడ నుండి తొలగించాలని, లేకుంటే మేమే తొలగించడం జరిగితుందని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ వెంట డి ఎస్పీ లు కొండయ్య నాయుడు, భక్తవత్సలం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సి ఐ లు రామ కృష్ణ, రామ్ కిషోర్, ఏసీపీ పార్వతి ప్రియ, పోలీస్, హెల్త్, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఉన్నారు.

# శ్రీ రావమ్మ తల్లి జాతర మహోత్సవం



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రావమ్మ తల్లి జాతర మహోత్సవం గురువారం ఉదయం మొదలై రాత్రి వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు పసుపు, కుంకుమలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు గ్రామంలోని ప్రతి కుటుంబ నుండి ఒక బిందెతో జలం తీసుకొనివచ్చి జలాభిషేకంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జలాభిషేకం అనంతరం డప్పులు, వాయిద్యములతో, మేకపోతులతో ఊరేగింపుగా కృష్ణానదికి వెళ్ళి స్నానాదులు ఆచరించి, గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా శ్రీ రావమ్మ తల్లి అమ్మ వారి చెంతకువచ్చి మహానైవేద్యం సమర్పించారు. జాతర అనంతరం అమ్మవారికి మేకపోతులు మొక్కుబడులు సమర్పించారు. రాత్రికి సుమారు 2000 వేల మందికి అన్నదాన కార్యక్రమం కమిటీ వారు నిర్వహించారు.

# ప్రొఫెసర్ నాగేశ్వరావు వ్యాఖ్యలను ఖండించిన మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్యం అనిబండి రామకృష్ణ అన్నారు మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో ప్రకటన విడుదల చేస్తూ జనసేన పార్టీ ఎప్పుడు ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తుందని ఇతర పార్టీల గురించి ఇతర వ్యక్తుల గురించి మాట్లాడదని అన్నారు ప్రొఫెసర్ నాగేశ్వరావు చేసిన వ్యాఖ్యలు అవాస్తవని మేధావి అని చెప్పుకునే నాగేశ్వరరావు ఆవాస్తవాన్ని వాస్తవాలుగా వండి వార్చడంలో దిట్ట అని పేర్కొన్నారు లిరాష్ట్ర పార్టీ ప్రొఫెసర్ నాగేశ్వరావు అనుచిత వ్యాఖ్యలను ఖండించిందని చట్టపరంగా చర్యలు తీసుకోబోతుందని తెలిపారు మరొకసారి ఇటువంటి వ్యాఖ్యలుఎవరు చేయకుండా ప్రొఫెసర్ నాగేశ్వరావు పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపం SAEL సోలార్ ప్రాజెక్టు

- మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి
- బ్రాండ్ సీబీఎన్ వల్లే ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి పరుగులు
- మాటిచ్చి చేతల్లో చూపే నాయకత్వంవల్లే పెట్టుబడుల వెల్లువ
- క్లీన్ ఎనర్జీ వినియోగించడమే కాదు... దేశానికి ఎగుమతి చేస్తాం
- సేల్ సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మంత్రి నారా లోకేష్





**జమ్మలమడుగు,కలంకౌంటర్ :** ఈరోజు కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3వేలకోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (SAEL) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "మా నాన్న ఉత్తరం రాశారు.. మా తాత కల కన్నారు.. నేను ఆత్మలతో మాట్లాడాను అంటే నమ్మే వాళ్ళు ఎవరు లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి." రెండింటికీ ఎంతో తేడా ఉందని అన్నారు.

**రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు..** మంత్రి లోకేష్ మాట్లాడుతూ...రికార్డ్ టైమ్ లో సాజుజూ ప్రాజెక్ట్ పూర్తి అయింది. ఇది స్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయం. మీ సహకారం వల్లనే ఈ ప్రాజెక్ట్ 11 నెలల్లో పూర్తి అయింది. రాష్ట్రం మొతం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈరోజు ఇతర నియోజకవర్గాల వాళ్ళు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. ఇక్కడ మెగా సోలార్ పార్క్ ఏర్పాటు చేసింది మనమే. ఇప్పుడు సాజుజూ తీసుకువచ్చింది మనమే. అదానీ, చింతా గ్రీన్, జెన్కో -- ప్యూజ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు తీసుకొచ్చింది మనమే. సాజుజూ రావడం వల్ల రైతులకు లబ్ధి జరిగింది, యువతకు ఉద్యోగాలు వచ్చాయి. కంపెనీలు తీసుకురావాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది ఒక్క మన బ్రాండ్ సీబీఎన్ గారికి మాత్రమే సాధ్యమని అన్నారు.

**విజయానికి మూడు మెట్లు..** పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికి ముఖ్యమైన మూడు కారణాలున్నాయి. అవి ఏంటంటే.. మొదటిది --- బ్రాండ్ సీబీఎన్. "పెట్టుబడిదారులు ఇప్పుడు మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం?" అని అడుగుతున్నారు. ఎందుకంటే, ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. రెండవది --- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. మేము స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను నమ్ముతాం. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాజెక్టే అందుకు నిదర్శనం. ప్రాజెక్ట్ భూమిపూజ నుండి ప్రారంభోత్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయింది. మూడవది --- డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైంది. మాది డబుల్-ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. రాష్ట్రప్రభుత్వ దార్శనికతకు కేంద్ర ప్రభుత్వ మద్దతు తోడైనప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుంది.

**ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం..** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, అధునాతన తయారీ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తోంది. ఆధునిక ఆర్థిక వృద్ధి ఎకోసిస్టమ్స్, స్పెషలైజేషన్, ఆవిష్కరణల ద్వారానే సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వం కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఎకో సిస్టమ్స్ ను నిర్మిస్తున్నాయి. సాజుజూ నాయకత్వంతో మొట్టమొదటి సంభాషణ నాకు ఇప్పటికీ గుర్తుంది. ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సంఘం సమావేశం సందర్భంగా జరిగింది. అది పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన సమావేశం కూడా కాదు. కానీ ఆరోజు ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను నిర్మించాలనే తమ ప్రణాళికల గురించి సాజుజూ నాయకత్వం ఎంతో ఉద్వేగంగా మాట్లాడింది. వారి ఉద్దేశాన్ని నేను వెంటనే గ్రహించాను. రెన్యువబుల్ ఎనర్జీలో ఫలితాలను సాధించాలన్న సాజుజూ సంస్థ దీర్ఘకాలిక ఆలోచన, వారి తపనను నేను పసిగట్టగలిగాను.

**స్థానిక సమాజంతో కలసి ముందడుగు..** పంజాబ్ లీడర్ షిప్ నేతృత్వంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు నిర్వహించగలదా? అనే ప్రశ్న నాలో మెదిలింది. సాజుజూ బృందం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిని, నన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం నా ప్రశ్నకు జవాబు దొరికింది. సాజుజూ బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో గ్రామస్థులు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారు. వారు క్షేత్రస్థాయికి వచ్చి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని, స్థానికుల సహకారంతో ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసింది.

**రికార్డువేగంతో ప్రాజెక్టు పూర్తి..** SAEL ?3,000 కోట్ల పెట్టుబడి పెట్టి, 2,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వీన్యూ1, వీన్యూ2 భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం 11 నెలల్లో వేగవంతంగా పూర్తయి రికార్డు సృష్టించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని సాజుజూ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అధునాతన టాప్‌కాన్ బైఫేషియల్ సోలార్ మాడ్యూల్స్ ఏర్పాటుచేశారు.

**11లక్షల టన్నుల కర్బన ఉద్గారాల తగ్గుదల..** ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కుదిరిన 25 ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి నాయకత్వం వహించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. SAEL బృందం మొత్తానికి, ముఖ్యంగా పంజాబ్ నుండి వచ్చిన మన సోదర సోదరీమణులకు నేను చెప్పేది ఒక్కటే. "తుస్సీ కమాల్ కర్ దిట్టా...చక్ దే ఫట్టే!" ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని కుటుంబ సభ్యులుగా స్వాగతిస్తోంది. క్రమశిక్షణ, పట్టుదల, వేగంతో ఎలా సాధించగలమో మీరు ఆచరణాత్మకంగా నిరూపించారు.

**నిర్మాణ సమయంలోనే వెయ్యిమందికి ఉపాధి..** ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ-ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి.

**వ్యవసాయ వ్యర్థాల నుంచి విద్యుత్..** రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ వ్యర్థాల నుండి దాదాపు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేవి సాజుజూ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇవి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పిస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో ఇవి వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయి.

# జూన్ నెలాఖరుకు ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ల ప్రాసెసింగ్ ప్రారంభించాలి

- మునిసిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుపై మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల పురోగతిపై మంత్రి నారాయణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మునిసిపల్ కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలోని 107 మునిసిపాలిటీల్లో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడానికి ప్రభుత్వం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటును చేపట్టిందని మంత్రి తెలిపారు. ప్లాంట్ల నిర్మాణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో ఒక్కో మునిసిపాలిటీ వారీగా మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ల ఏర్పాటు వేగవంతంగా పూర్తయ్యేలా అవసరమైన స్థలం, విద్యుత్, నీటి సరఫరా, రోడ్డు కనెక్టివిటీ వంటి అన్ని మౌలిక వసతులను వెంటనే కల్పించాలని మునిసిపల్ కమిషనర్లకు మంత్రి నారాయణ ఆదేశించారు. జూన్ నెలాఖరులోపు అన్ని ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటు పనులు పూర్తి చేసి, వ్యర్థాల ప్రాసెసింగ్ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# జీవవైవిధ్య పరిరక్షణ వ్యక్తిగత అవార్డుల్లో జెవి రత్నం కు అవకాశం

- గ్రీన్ క్లైమేట్ టీం కార్యక్రమాలు గుర్తించిన బయోడైవర్సిటి బోర్డు
- 36 సంవత్సరాల జెవి రత్నం కృషి కి గుర్తింపు







**విజయవాడ, కలంకౌంటర్ :** జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ కోరారు. శుక్రవారం గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేశారు. ప్రధానంగా వ్యక్తిగత విభాగంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, అలాగే తిరుపతి నుంచి బండారు బాలసుబ్రహ్మణ్యం, భూషణం మాష్టారు తదితరులకు అందజేశారు. ప్రధానంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ విషయానికి వస్తె గడిచిన 36 సంవత్సరాల లో 5.9 కోట్ల సీడ్ బాల్స్ తయారు చేయడం. 8.9 లక్షల మట్టి పాత్రలు పశుపక్ష్యాదులకు నీరు ఏర్పాటు చేయడం, 2. 8 లక్షల పిచ్చుకల గూళ్ళు ఏర్పాటు , ఏటా పది వేల నుండి నుండి 50 వేల ధాన్యం కంకులతో కుచ్చులు తోరణాలు తయారీ, పంపిణీ చేయడం, ప్రతి సంవత్సరం యుఎన్ పర్యావరణ దినోత్సవాల కాలమానిని ముద్రించి విద్యా సంస్థలకు అందజేస్తోంది. అలాగే జిల్లా కలెక్టరేట్, జివిఎంసి, ఎపి పిసిబి, అటవీశాఖ, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, విభిన్న స్వచ్ఛంద సంస్థ లు, దాతృత్వం కలిగిన వారి సహాయంతో ఈ సంస్థ తమ విభిన్న కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ప్రతి ఏటా నాటుతున్న మొక్కలు, పెంచుతున్న కూరగాయలు మొక్కలు, విత్తనాలు పంపిణీ, మన ఇంట కూరగాయల పంటలు, వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారీ, ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం వీటిని దృష్టిలోకి తీసుకుని జీవవైవిధ్య మండలి ఈ అవార్డు అందజేసింది. ఈ అవార్డుల కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ రామకృష్ణ, ఎపి అటవీ శాఖ అభివృద్ధి మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నందినీ సలారియా, మెడిసినల్ ప్లాంట్స్ బోర్డ్ సిఇఒ చంద్ర శేఖర్, నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సింహాచలం, బోటనీ ప్రొఫెసర్ బ్రహ్మాజీ , వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ జాతీయ ప్రతినిధి ఫరీదా తదితరులు పాల్గొని మాట్లాడారు.

# గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం

(మొదటిపేజీ తరువాయి)

నిదర్శనమన్నారు. టీడీపీ కార్యకర్తల ప్రాణాలు తీసి ఇప్పుడు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజారెడ్డి నుంచి వివేకా వరకు ప్రతి చావులో జగనే ప్రధాన లబ్ధిదారు. జగన్‌ను సైకో అనాలా... పిచ్చోడు అనాలా అర్థం కావడం లేదు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిపై జగన్ చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, అమరావతికి రాజముద్ర పడిన తర్వాత కూడా మావిగన్ అంటున్నారు. గ్రామీణ రోడ్లు, జాతీయ రహదారులు, ఐకానిక్ రాజధాని రోడ్లు అన్నీ ఒకేలా ఉంటాయా? అని ప్రశ్నించారు. విశాఖలో జగన్ కట్టుకున్న ప్యాలెస్‌కు ఎంత ఖర్చు పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే జగన్ ఓర్చుకోలేకపోతున్నారు. ఆస్తి, పదవి కోసం కార్యకర్తలను కూడా వదలరు. ఆ పార్టీ కార్యకర్తనే కారు కింద వేసి తొక్కించేశారు అంటూ అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. జీతాలు ఇస్తే చాలు అని ఉద్యోగులతో దండాలు పెట్టించుకున్నారు. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినా జగన్ తగ్గించలేదు. ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న ప్రతి అంశాన్ని సరిచేసే ప్రయత్నం చేస్తున్నామని, విద్యుత్ ఛార్జీలను తగ్గించిన చరిత్రను ఎన్డీయే ప్రభుత్వం సృష్టించిందన్నారు. ఇకపై జగన్ చేసే ప్రతి అబద్ధపు ఆరోపణకు వడ్డీతో సహా సమాధానం చెబుతామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# కోదండ రాముని పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు





**ముండ్లమూరివారిపాలెం, కలంకౌంటర్ :** పొన్నలూరు మండలం ముండ్లమూరి వారి పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీ కోదండ రాముని పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, టీటీడీ వేద పండితులు సీతారామాచార్యులు, టిడిపి వేద పండితులు అవినాష్ స్వామి ల ఆధ్వర్యంలో వేదమంత్రాలు నడుమ ధ్వజారోహణం జరిగింది. ఉభయ దాతలుగా ఇప్పగుంట కాంతారావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. శుక్రవారం నల్లూరి వారి మేటి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం గ్రామస్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా సన్నిధి సాయి



**విజయవాడ,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా (2026బి28)సన్నిధి సాయి శ్రీనివాస్ ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సన్నిధి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో ఈ బాధ్యత అప్పగించిన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరి రంగనాథ్, పెనుగొండ సుబ్బరాయుడు,దర్శి వాసు లకు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా అధ్యక్షుడు సన్నిధి సాయి కి సన్మానం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా సన్నిధి సాయి శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్ నివాసంలో చిరు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మోట మ(్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కారం కోసం,సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు పొందిన సన్నిధి సాయి శ్రీనివాస్ ను అభినందించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ గోల్డ్ వ్యాపారవేత్త ఉడత్తు సురేష్, యువజన సంఘం జిల్లా నాయకులు వెచ్చా గుప్తా, వేముల కృష్ణ, జయవరపు ప్రసాద్ ,పులవర్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# జనసేన పార్టీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన బండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిమజ్జిగ పంపిణీ చేసిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండిరామకృష్ణ ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూలి మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని మండల పట్టణ ప్రాంతాల్లో వివిధ చోట్ల లిజనసేన పార్టీ శ్రేణులు చలివేంద్రాన్ని ప్రారంభించి గత నెల రోజుల నుండి మజ్జిగ శీతల పానీయాలతో పాటు వేసవి దాహార్తిని తీర్చడానికి మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించామని వేసవి ఉష్ణోగ్రతల దృశ్య మజ్జిగ పంపిణీ చేపట్టామన్నారు. వేసవి పట్ల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వృద్ధులు పిల్లలు బయటకు రాకపోవడం ఉత్తమమన్నారు తప్పనిసరి పరిస్థితుల్లో తగు జాగ్రత్తలు తీసుకొని బయటకు రావాలని కోరారు స్వచ్ఛంద సంస్థలు మానవతావాదులు పాదచారులు ప్రయాణికుల కొరకు తమ తమ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి తమ వంతుసేవలందించాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఈడేపల్లి శక్తిగుడిదేవాలయ ప్రతినిధులు విన్నకోట నరసింహారావు, ఆళ్ల శివ, ఆళ్ళమాధవ, వేమూరి బుజ్జి సుధా బత్తుల తిలక్,జోగి అంజయ్య,పులిచర్ల ప్రసాద్ సూదగానిచరిత్ జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు,గళ్ళాతిమోతి, మహమ్మద్ సమీర్,కర్రీ మహేష్,పినిశెట్టివేణు, కొక్కురాజేష్,కొట్టెవెంకట్రావు, కూనపురెడ్డి ప్రసాద్, ఈవనమణిబాబు, శాయనశివయ్య, వడ్డీకిశోర్, ఉడుములబుజ్జి, గణేషన్ రామారావు,పెద్ద సింగుచిరంజీవి,బీరంసుదర్శన్,ఘంటసాలబుజ్జి,జొన్నల సూర్య,మోకాచిరంజీవి, పలనియప్పరెడ్డికోటి,తోట భాస్కర్, జన్నునాగరాజు,బొద్దుల పవన్, ముత్తిరెడ్డి పృథ్వీ,మహేష్,మంత్రి పృద్వి,మోకారవి, గంపల కృష్ణ, రామ్ జ్యోతి,గణేష్,సాయి, ఏరువశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 38 కోట్లతో 825 కాలువ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.. కలెక్టర్ డీకే బాలాజీ





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లాలో పంట కాలువల మరమ్మత్తు పనులు సంబంధించి 38 కోట్లతో 825 వర్కులు నీటి సంఘాల రైతుల భాగస్వామ్యంతో వేగవంతంగా జరుగుతున్నాయని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. శుక్రవారం బంటుమిల్లి ప్రధాన కాలువకు కృత్తివెన్ను మండలంలో జరుగుతున్న పనులను బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా కాశి తో కలిసి కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా కాశి బంటుమిల్లి ప్రధాన కాలవలో జరుగుతున్న 54 లక్షలతో 20 కిలోమీటర్ల మేర పూడిక తీత పనులను ఆయనకు వివరించారు. పనులను పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో 38 కోట్లతో వివిధ కాలవల్లో 825 వర్కులు వేగవంతంగా జరుగుతున్నాయి అన్నారు నీటి సంఘాల భాగస్వామ్యంతో అనగా రైతుల భాగస్వామితో ఎక్కువ వేగంగా ఈ పనులు జరుగుతున్నట్లు ఆయన గుర్తించారు ఈ సందర్భంగా బంటుమిల్లి ప్రధాన కాలువ కు 54 లక్షలతో 20 కిలోమీటర్ల మేర పోటికి పనులను వేగంగా జరుగుతొండటం పట్ల ఆయన డి సి చైర్మన్ బొర్రా కాశి విశ్వేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ పర్యటనలో కలెక్టర్ తో పాటు ఇరిగేషన్ ఎస్సీ గుణకర్ ఈఈ ఆంజనేయ ప్రసాద్ డి ఈ భరత్ ఏఏ రాజ్యలక్ష్మి డి సీ చైర్మన్ బోర్ర కాశి మరియు రైతులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** లింగసముద్రం గ్రామ టిడిపి అధ్యక్షులు గాలంకి ప్రసాద్, అనారోగ్యం కారణంగా నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. అలాగే లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామ టిడిపి నాయకులు ఎందేటి వెంకటేశ్వర్లు, ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు వారిద్దరి వద్దకు వెళ్లి, పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాలంకి ప్రసాద్ ఆరోగ్యం గురించి డాక్టర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, పారా బుచ్చయ్య, అడపా రంగయ్య, రాజవరపు మాలకొండయ్య, ఎందేటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

శుభాకాంక్షలు





కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా నియమితులైన
స్నేహశీలి... సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ...
ఆర్యవైశ్యులకు అండగా ఉంటున్న మిత్రుడు...
సన్నిధి సాయి శ్రీనివాస్ గారికి శుభాకాంక్షలు
వేముల కృష్ణ
వెచ్చా గుప్తా
మచిలీపట్నం

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com